సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 24 । అక్టోబర్ । 2024



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.17, సరాసరిన రూ.30 ప్రకారం ధర పలికింది.



అయ్య బాబోయ్.. ఇదేమి శిక్షణ?

శ్రీసత్యసాయి, నంద్యాల జిల్లాల ఉపాధ్యాయులకు హిందూపురంలో రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తుండటంతో టీచర్లంతా ఇబ్బందులు పడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
35.1°/22.4°

జిల్లాలో బుధవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

రెక్కల కష్టం నీటిపాలు



పెనుకొండ మండలం సత్తార్‌పల్లికి చెందిన రఘునాథరెడ్డి సాగుచేసిన మొక్కజొన్న పంట ఇది. రఘునాథరెడ్డి ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేయగా.. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంట మొత్తం నీట మునిగింది. ఐదు ఎకరాల్లో పంటసాగుకు రూ. 2 లక్షల వరకు పెట్టానని, పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షంతో పంట మొత్తం నేలకొరిగి నాశనమైందని రైతు వాపోతున్నారు.



కనగానపల్లి చెరువు కట్ట తెగడంతో వరి పంటపై ప్రవహించిన వరదనీరు

- వర్షాలతో భారీగా దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు
- విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం వర్షార్పణం
- 1,332 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారుల ప్రాథమిక అంచనా
- ప్రభుత్వం పరిహారమిచ్చి ఆదుకోవాలని వేడుకోలు

3,65,175 హెక్టార్లు
జిల్లాలో సాగు భూమి

1,62,800 హెక్టార్లు
ఈ ఖరీఫ్‌లో పంటలు సాగైన విస్తీర్ణం

1,332 హెక్టార్లు
ఇటీవల కురిసిన వర్షాలతో పంట దెబ్బతిన్నది
(అధికారుల ప్రాథమిక అంచనా)

సాక్షి, పుట్టపర్తి

ప్రకృతి సహకరించక.. ప్రభుత్వం పట్టించుకోక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి అతివృష్టి.. అనావృష్టితో జిల్లాలో రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. వరుస తుపాన్లతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లుతోంది. ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన సమయంలో వర్షాలు ముఖం చాటేయగా.. అరకొరగా పంటలు సాగులోకి వచ్చాయి. రెక్కల కష్టంతో రైతు కుటుంబం పంటలను కాపాడుకోగా, రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి. దీంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అంచనాలకు మించి పంటనష్టం..

జిల్లాలో 3,65,175 హెక్టార్ల సాగుభూమి ఉండగా, 1,62,800 హెక్టార్లలో మాత్రమే రైతులు పంటలు వేశారు. అప్పట్లో అరకొర వర్షాలకుగానూ చాలా చోట్ల విత్తనం పడలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు 1,332 హెక్టార్లలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పాక్షికంగా దెబ్బతిన్న పంటను కూడా లెక్కిస్తే కనీసం 50 వేల హెక్టార్లలో పంట నష్టం జరిగి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

రైతన్నపై దెబ్బమీద దెబ్బ..

కీలకమైన జూన్, జూలైలో వర్షాలు కురవలేదు. ఫలితంగా చాలా చోట్ల రైతులు పంట వేయలేదు. అరకొర వర్షాలకు తడిసిన భూముల్లో కొందరు విత్తనం నాటారు. ఇంకొన్ని చోట్ల బోరుబావుల ద్వారా పంట వేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆగస్టులో కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంట నష్టం జరిగింది. జిల్లాలో వేల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. వేసిన పంటలు కుళ్లిపోవడంతో కొంతమంది రైతులు తిరిగి మళ్లీ పంటలు సాగు చేశారు. అయితే పది రోజులుగా తపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేసిన పంటలు మళ్లీ దెబ్బతిన్నాయి. రెండు రోజుల క్రితం కురిసిన రికార్డు స్థాయి వర్షాలకు పెనుకొండ, రాప్తాడు పరిధిలో భారీగా పంట నష్టం జరిగింది. కల్లాల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం నీట మునగడంతో రైతుకు కన్నీరే మిగిలింది.



మామిళ్లపల్లి వద్ద జలమయమైన పెట్రోల్ బంకు

రికార్డు స్థాయి వర్షం..

ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ వర్షాలకు పంటలన్నీ నీట మునిగాయి. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు కూడా పూర్తి స్థాయిలో దెబ్బ తిన్నాయి. పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహకరించక.. ప్రభుత్వం పట్టించుకోక నట్టేట మునిగిపోతున్నామని వాపోతున్నారు.

పిచికారీకి సమయం లేదాయె..

తాజా వర్షాలతో అక్కడక్కడా మిగిలిన కంది, వరి పంటకూ తెగుళ్లు సోకుతున్నాయి. నివారించేందుకు మందుల పిచికారీకి భారీగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. అప్పుచేసైనా పంటను కాపాడుకోవాలని కొందరు రైతులు భావించినా... ఎడతెరిపి లేని వర్షాలకు పురుగుల మందు కొట్టడానికి కూడా సమయం దొరకడం లేదు. పురుగులమందు పిచికారీ చేసినా... రెండు మూడు గంటల్లోపే వర్షం కురుస్తుండటంతో అంతా వృథా అవుతోందని పలువురు రైతులు వాపోతున్నారు.

ఆదుకోని ప్రభుత్వం..

రైతులు వరుస వర్షాలకు తీవ్రంగా నష్టపోతున్నా.. ప్రభుత్వం మాత్రం వారిని ఆదుకునే ప్రయత్నం చేయలేదు. ఇప్పటి వరకు ఎలాంటి నష్ట పరిహారం ప్రకటించలేదు. పంట పూర్తిగా నష్టపోయిన రైతులకు తిరిగి సాగు చేయడానికి అవసరమైన విత్తనాలు ఇస్తారని ఆశించినా... కూటమి సర్కార్ ఆ మాత్రం సాయం కూడా చేయలేదు. ఇప్పటి వరకూ కేవలం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ. 2 వేలు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యింది.

గత ప్రభుత్వంలోనే మేలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు ఏటా వైఎస్సార్ రైతు భరోసా నిధులు అందేవని, దీంతో పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన అవసరం ఉండేది కాదని రైతులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం 'రైతు భరోసా' పథకాన్ని రద్దు చేయడంతో పెట్టుబడుల కోసం ఇప్పటికే రైతులు రూ.లక్షల మేర అప్పులు చేశారని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరుస వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వరి ఒరిగిపోయింది



నేను రూ.50 వేల పెట్టుబడితో అర ఎకరంలో వరి వేశాను. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కొండ ప్రాంతాల నుంచి వర్షపు నీరు.. వరి పంటలోకి వచ్చి చేరింది. దీంతో పంట మొత్తం ఒరిగిపోయింది. ఒక్క రాత్రిలోనే వరి నేలమట్టం అయ్యింది. పెట్టుబడి... నాలుగు నెలలు శ్రమ వృథా అయ్యింది. ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలి.

– నరసింహారెడ్డి, రైతు, శెట్టిపల్లి, పెనుకొండ మండలం

ప్రభుత్వం స్పందించాలి



భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదు. నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతునూ సర్కారు ఆదుకోవాలి. ప్రకృతి ప్రకోపానికి దెబ్బ తిన్న రైతులకు మరో పంట వేసుకునేందుకు ఉచితంగా విత్తనాలు ఇవ్వడంతో పాటు పెట్టుబడి సాయం అందజేయాలి.

– వెంకటేశ్, సీఐటీయూ, పుట్టపర్తి

1,332 హెక్టార్లలో పంట నష్టం



మార్లపల్లి వద్ద నేలకొరిగిన వరి

పుట్టపర్తి అర్బన్: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పలు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన పంట తడిసిపోవడం...పొలంలోని పంట కుళ్లిపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లా వ్యాప్తంగా 1,332 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. అందులో 482 హెక్టార్లలో వేరుశనగ, 540 హెక్టార్లలోని వరి, 119 హెక్టార్లలో మొక్కజొన్న, 64 హెక్టార్లలోని సజ్జ, 40 హెక్టార్లలో కంది, 22 హెక్టార్లలో పత్తి, 8 హెక్టార్లలో కొర్ర, 2 హెక్టార్లలో సామల పంట దెబ్బతిన్నాయి. ఇక 2 హెక్టార్లలో ఇసుక మేటలు వేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇలా మొత్తంగా 1,279 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం జరిగింది. మరో 53 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. అందులో టమాట 33.2 హెక్టార్లు, అరటి 8.4 హెక్టార్లు, మిరప 3 హెక్టార్లు, మునగ 3 హెక్టార్లు, ద్రాక్ష 2.30 హెక్టార్లు, ఉల్లి హెక్టారు, చీనీ అర ఎకరా, చిక్కుడు అర ఎకరా, బంతిపూలు, వంకాయ ఎకరా విస్తీర్ణంలో దెబ్బతిన్నాయి.

న్యూస్‌రీల్

నాడు పొగిడి.. నేడు విమర్శిస్తారా?

- వాసిరెడ్డి పద్మపై ఉషశ్రీ చరణ్ మండిపాటు




పెనుకొండ రూరల్: వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు నిత్యం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పొగిడిన వారు.. నేడు విమర్శలు చేయడం బాధాకరమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి పొందిన వాసిరెడ్డి పద్మ... నేడు పార్టీపై, పార్టీ అధినేతపై విమర్శలు చేయడం చూస్తే ఆమె దిగజారుడు రాజకీయం తెలుస్తోందన్నారు. ఈ మేరకు ఉషశ్రీచరణ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఏ పార్టీలోకైనా వెళ్లవచ్చని, అలాగే వాసిరెడ్డి పద్మ ఏ పార్టీలో చేరినా తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ తిన్నింటివాసాలు లెక్కపెట్టడం సరికాదని హితవు పలికారు. వాసిరెడ్డి పద్మలాంటి వారు ఎంత మంది పార్టీని వీడినా నష్టం లేదన్నారు. వైఎస్ జగన్‌ను రాష్ట్రంలోని కోట్లాది మంది జనం గుండెల్లో పెట్టుకుని చూసుకుంటున్నారని, లక్షలాది మంది కార్యకర్తలు అండగా నిలుస్తున్నారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రజాభిమానంతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు ఇలాంటి వారంతా సిగ్గుతో తలదించుకుంటారన్నారు.

రేపు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంతకల్లు: దానా తుపాను ప్రభావంతో భువనేశ్వర్ నుంచి కేఎస్‌ఆర్ బెంగళూరు మధ్య నడిచే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు (నంబర్ 18463)ను శుక్రవారం (ఈ నెల 25) ఒక్క రోజు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ శ్రీధర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



టీబీ డ్యాం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన భారీ వర్షాల కారణంగా బుధవారం 1,10,759 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. డ్యాం అధికారులు 21 గేట్లు మూడు అడుగుల మేర ఎత్తి 89,382 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. మరో 15,627 క్యూసెక్కుల నీటిని కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 101.461 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా.. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్ వద్ద 1,800 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ప్రాణం తీసిన వాటర్ హీటర్

- విద్యుదాఘాతంతో బాలిక మృతి



మృతి చెందిన శ్రీవల్లి

కనగానపల్లి: స్నానం చేసేందుకు హీటర్‌తో నీటిని వేడి చేసుకునేందుకు ప్రయత్నించిన ఓ బాలిక విద్యుదాఘాతంతో మృతి చెందింది. ఈ సంఘటన బుధవారం కనగానపల్లి మండలం చంద్రాచెర్ల గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రాచెర్లకు చెందిన నరసింహులు, నాగవల్లి దంపతుల కుమార్తె శ్రీవల్లి (9) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. బుధవారం మధ్యాహ్నం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన బాలిక.. స్నానం చేసేందుకు బాత్‌రూంలో ఉన్న వాటర్‌హీటర్ ఆన్ చేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే గమనించిన కుటుంబీకులు బాలికను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆరోగ్య పరిస్థితి విషమించటంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు.

ఫైనల్‌కు దూసుకెళ్లిన ఒడిశా

అనంతపురం: రాజమాత జిజాబాయి ట్రోఫీ–2024 సీనియర్ నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ జోనల్ రౌండ్ పోటీలు బుధవారం ముగిశాయి. దేశ వ్యాప్తంగా 8 జట్లు ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఆర్డీటీ స్టేడియం వేదికగా బుధవారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్‌పై 0–2 గోల్స్ తేడాతో ఒడిశా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. కాగా, ఫైనల్ మ్యాచ్ ఎక్కడ జరుగుతుందనేది త్వరలో షెడ్యూల్ ఖరారు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- సిబ్బందికి డీఎంహెచ్‌ఓ మంజువాణి ఆదేశం



మడకశిర మండలం కల్లుమర్రి పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ మంజువాణి

మడకశిర రూరల్/ పరిగి: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మంజువాణి అన్నారు. బుధవారం ఆమె మడకశిర మండలంలోని కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పరిగి మండలంలోని ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వైద్య సేవల గురించి ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య చికిత్సలు అందించాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల గురించి వివరించి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. వైద్య చికిత్సల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఊటుకూరు పీహెచ్‌సీ నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతం పీహెచ్‌సీ నడుస్తున్న తాత్కాలిక భవనంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట వైద్యులు మాధుర్య, వినోద్‌కుమార్, ఊటుకూరు మెడికల్ ఆఫీసర్లు సురేష్‌బాబు, రూబీ, కల్లుమర్రి సీహెచ్‌ఓ హుస్సేన్, ఫార్మసీ ఆఫీసర్ విజయశ్రీ, సూపర్‌వైజర్ రాంప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

అత్యాచార ఘటనలో మరో నిందితుడి అరెస్ట్

- ఏ–2 చాకలి శ్రీనివాసులును కోర్టులో హాజరు పరిచిన పోలీసులు

పుట్టపర్తి టౌన్/హిందూపురం అర్బన్: సంచలనం సృష్టించిన చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి గ్యాంగ్‌రేప్ ఘటనకు సంబంధించి మరో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మడకశిర కోర్టులో హాజరుపరిచి జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. ఎస్పీ రత్న తెలిపిన వివరాల మేరకు.. చిలమత్తూరు మండలం నల్లబొమ్మనపల్లి సమీపంలో నిర్మాణంలో ఉన్న పేపర్‌మిల్లు వద్ద జీవనం సాగిస్తుండగా.. ఈ నెల 11న అర్ధరాత్రి ఆరుగురు వ్యక్తులు రెండు బైకుల్లో వచ్చి...కుటుంబీకులపై దాడి చేసి అత్తాకోడళ్లపై అత్యాచారం చేశారు. బాధిత కుటుంబం ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు 48 గంటల్లోనే ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. కేసులో ఏ–2గా ఉన్న నిందితుడు చాకలి శ్రీనివాసులు అలియాస్ శ్రీనాథ్ తప్పించుకుని తిరుగుతుండగా.. డీఎస్పీ కేవీ మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు తీవ్రంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలోనే బుధవారం హిందూపురం మండలం పూలకుంట సమీపంలో ఉన్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, చాకలి శ్రీనివాసులు స్వస్థలం లేపాక్షి మండలం కల్లూరు కాగా, హిందూపురంలోని గుడ్డం వద్ద నివాసం ఉంటున్నాడు. అతను పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.

నిర్భయంగా ముందుకు రావాలి..

అత్యాచార ఘటనలో నిందితులైన వారు నేర స్వభావం కలిగిన వారని, గతంలోనే అనేక నేరాలు చేశారన్నారు. ముఖ్యంగా హిందూపురం ఇందిరమ్మ కాలనీ, బిట్స్ కళాశాల, గుడ్డం, చిలమత్తూరు కనుమ, టేకులోడు, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ గతంలోనూ అనేక నేరాలకు పాల్పడ్డారని, ఎవరైనా బాధితులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఎస్పీ రత్న సూచించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. బాధితులు నిర్భయంగా ముందుకు వస్తే తప్పక న్యాయం చేస్తామన్నారు.

రూ.2.55 కోట్లతో ప్రతిపాదనలు

- వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, కాలువల మరమ్మతులు
- కలెక్టర్ టీఎస్ చేతన్



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న వివిధ జాతీయ రహదారులు, చెరువు గట్ల మరమ్మతుల కోసం రూ.2.25 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. భారీ వర్షాలతో వివిధ శాఖల పరిధిలో జరిగిన నష్టాలపై నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 13వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కురిసిన భారీ వర్షాలతో మడకశిర బ్రాంచ్ కెనాల్, అనంత వెంకటరెడ్డి హంద్రీనీవా సుజల స్రవంతి పథకం కాల్వలకు 8 చోట్ల గండ్లు పడ్డాయని, వాటి మరమ్మతులు, చెరువులు పటిష్ట పరిచేందుకు అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. అలాగే 10 మండలాల పరిధిలోని 25 గ్రామాల్లో నష్టం జరిగిందని, 1,279 హెక్టార్లలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే 54.21 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. ధర్మవరం రెవెన్యూ డివిజన్‌లో 4 , కదిరి డివిజన్‌లో 20, పెనుకొండ డివిజన్‌లో ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారన్నారు. 13 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి మరమ్మత్తులకు రూ.153 లక్షల అవసరమని కోరామన్నారు. అలాగే రామగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పాక్షికంగా దెబ్బతినిందని, ధర్మవరంలోని 372 మరమగ్గాల గుంతల్లో నీరు చేరిందని తెలిపారు. పబ్లిక్ ఆస్తులకు రూ.9 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. కరెంటు స్తంభాలు పడిపోవడం వల్ల విద్యుత్ శాఖకు రూ.2 లక్షల నష్టం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. వీటన్నింటిని ప్రస్తావిస్తూ ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు.

తెగ తాగేస్తున్నారు!

- 7 రోజుల్లో 4 లక్షల లీటర్ల మద్యం అమ్మకం
- లిక్కర్ గోడౌన్ నుంచి రూ.57.51 కోట్ల విలువైన మద్యం సరఫరా
- బార్లలో జరుగుతున్న మద్యం వినియోగం అదనం
- బెల్టు షాపులు వస్తే రోజూ రూ.10 కోట్ల విలువైన మద్యం అమ్ముడవుతుందని అంచనా



సాక్షి ప్రతినిధి, అనంతపురం: చంద్రబాబు పుణ్యమా అని ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మద్యం కిక్కు బాగా ఎక్కింది. మద్యం అమ్మకాలకు డోర్లు బార్లా తెరవడం, ఎక్కడా నియంత్రణ లేకపోవడం, ఎమ్మెల్యేలే దగ్గరుండి మద్యం షాపుల నిర్వహణకు పూనుకోవడం తదితర కారణాలతో మద్యం వినియోగం భారీగా పెరిగింది. మరోవైపు బార్లలో వినియోగం ఎలాగూ ఉంది. గతంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రోజుకు రూ.3.50 కోట్ల మద్యం వ్యాపారం జరిగితే చాలా గొప్ప. ఇప్పుడది రమారమి రూ.5.5 కోట్లు దాటినట్టు తేలింది. ఓవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నా స్పందించని కూటమి సర్కారు.. మరోవైపు మద్యం రేటు ఎంతున్నా తాగండి తాగండి అంటూ ఊరూరికీ మద్యం సరఫరా చేస్తూ ఆదాయం పెంచుకుంటుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పోలీసుల సహకారం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుడి,బడి తేడా లేకుండా విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. ఎక్కడైనా ఎవరైనా వ్యతిరేకిస్తే టీడీపీ మూకలు దాడులకు తెగబడుతున్నాయి. పోలీసులు కూడా బాధితులపైనే రివర్స్ కేసులు పెడుతున్నారు. మద్యం నియంత్రణకు పాటుపడాల్సిన వారే ఇలా ఎమ్మెల్యేల ఆదాయానికి కాపలా కాస్తుండటం విమర్శలకు తావిస్తోంది. అనంతపురం వన్‌టౌన్ సీఐ వ్యవహారమే ఇందుకు నిదర్శనం.

చీప్ లిక్కర్ వస్తే మరింతగా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చీప్ లిక్కర్ అమ్మకాలు పెంచేందుకు సర్కారు చీప్ లిక్కర్‌ను బాగా ప్రమోట్ చేస్తోంది. రూ.99కే మద్యం అంటూ కార్పొరేట్ కంపెనీలు ప్రకటనలు ఇచ్చినట్టుగా టీడీపీ నేతలు చెబుతున్నారు. తాజాగా 22వ తేదీ 750 కేసుల మద్యం వస్తే గంటలోనే అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి చీప్ లిక్కర్ కోసం జనం ఎలా ఎగబడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఇకపోతే.. సర్కారు సరఫరా చేస్తున్న మద్యం నాణ్యతపై వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. హోటళ్లు, ధాబాలు, చిన్న రెస్ట్ రూములు, లాడ్జిల్లో మద్యపానం విచ్చలవిడి అయింది. భవిష్యత్తులో ఉమ్మడి జిల్లాలో రోజుకు రూ.10 కోట్ల విలువైన మద్యం వినియోగం జరిగినా ఆశ్చర్యం లేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 23వ తేదీ ఉదయం 11 గంటల సమయానికి లెక్కలు..

అనంతపురం జిల్లాలో మద్యం షాపులు	136
ఇప్పటివరకూ ప్రారంభించినవి	127
శ్రీ సత్యసాయి జిల్లాలో మద్యం షాపులు	87
ఇప్పటివరకూ ప్రారంభించినవి	81
లిక్కర్ గోడౌన్‌నుంచి వెళ్లిన మద్యం	65,456 కేసులు (5,89,104 లీటర్లు)
మద్యం విలువ	రూ.57,51,24,688
మద్యం షాపుల నుంచి వినియోగం	3,82,917.6 (లీటర్లు)
దీని విలువ	రూ.37,31,81,047
రెండు జిల్లాల్లో బీర్ల అమ్మకాలు	18,462 కేసులు
బార్లలో జరుగుతున్న మద్యం వ్యాపారం	రూ.80 లక్షలు (రోజుకు)

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని యోగి వేమన ఆలయం వెనుక ఉన్న పొలాల్లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నల్లచెరువులో నివాసముంటున్న వెంకటేష్ (35) కొంత కాలంగా వ్యసనాలకు బానిస కావడంతో భార్య యశోద విసుగు చెంది పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ అంశంపై కుటుంబ పెద్దలు కలుగజేసుకొని తీరు మార్చుకుని కుటుంబాన్ని సరిగా చూసుకోవాలని వెంటేష్‌ను మందలించారు. దీంతో మనస్తాపం చెందిన వెంకటేష్ మంగళవారం రాత్రి పొలంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్‌ఐ మక్బూల్‌బాషా సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వివాహిత దుర్మరణం

లేపాక్షి: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని డి.పాళ్యం గ్రామానికి చెందిన హసీనాబీ(40), రియాజ్ దంపతులు బుధవారం ఉదయం ద్విచక్రవాహనంపై లేపాక్షి మండలం మైదగోళం గ్రామానికి బయలుదేరారు. మైదుగోళం క్రాస్ వద్దకు చేరుకోగానే వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో హసీనాబీ అక్కడికక్కడే మృతి చెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

హతుడి ఆచూకీ లభ్యం

రొద్దం: మండలంలోని తురకలాపట్నం సమీపంలో ఇటీవల వెలుగు చూసిన గుర్తు తెలియని వ్యక్తి హత్య కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. హతుడిని పరిగి మండలం ధనాపురం గ్రామానికి చెందిన కురుబ తిప్పన్న కుమారుడు రమేష్‌గా గుర్తించారు. తురకలాపట్నం సమీపంలోని ఈత వనంలో ఈ నెల 22న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న పోలీసులు అదే రోజు అక్కడకు చేరుకుని పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తిని దుండగులు గొంతు కోసి హతమార్చిన అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించినట్లుగా గుర్తించారు. నాలుగు రోజుల క్రితం ఈ ఘటన జరిగి ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి హత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం హతుడిని రమేష్‌గా గుర్తించి, మరింత లోతైన దర్యాప్తు చేపట్టారు.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ నరసింహమూర్తి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

అనంతపురం: అనంత పోలీస్ శాఖలో పేరుగాంచిన కంబదూరు నరసింహమూర్తి బుధవారం అనంతపురం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. నిరుపేద ఎస్సీ కుటుంబంలో జన్మించిన ఆయన 1996లో పోలీసు శాఖలో చేరారు. మంచి ధైర్య సాహసాలతో ఎన్‌కౌంటర్ల స్పెషలిస్టుగా ఖ్యాతి గాంచారు. జిల్లాలో ఆయన పేరు తెలియని మావోయిస్టులు లేరు. ఉమ్మడి ఏపీ డీజీపీ నుంచి పలు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ప్రస్తుతం పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన ఆయన అనంతపురం జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు.

అయ్యబాబోయ్.. ఇదేమి శిక్షణ?

- సర్కారు బడులకు శాపంగా మారిన వృత్యంతర శిక్షణ
- రెండు జిల్లాలకు ఫిబ్రవరి వరకూ ఒకే చోట నిర్బంధ శిక్షణ



బిట్ కాలేజీలో వృత్యంతర శిక్షణ తరగతులకు హాజరైన ఉపాధ్యాయులు

హిందూపురం: ఆధునికత కొత్తపుంతలు తొక్కుతున్న తరుణంలో విద్యా వ్యవస్థలో ఇంకా శిక్షణల పేరుతో పాతకాల పద్ధతులనే కొనసాగించడం వివాదాస్పదంగా మారింది. అందరి చేతుల్లో ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు, ఇళ్లలో పర్సనల్ కంప్యూటర్లు వాడకం సాధారణమైన ఈ రోజుల్లో కూడా ఆన్‌లైన్ శిక్షణలు గాలికి వదిలేసి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు రెసిడెన్షియల్ శిక్షణ పేరుతో కూటమి సర్కార్ చేపట్టిన కార్యాచరణపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రెండు జిల్లాలకు కలిపి ఒకేచోట..

ప్రాథమిక పాఠశాలల్లో చదివే పిల్లలకు భాష, గణితంలో అభ్యాసన సామర్థ్యాలను మరింత పెంచేలా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పేరుతో శిక్షణ కార్యక్రమాలను చేపట్టారు. ఈ నెల 21న ప్రారంభమైన ఈ శిక్షణా తరగతులు వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ కొనసాగనున్నాయి. హిందూపురంలోని బిట్ కళాశాల వేదికగా జిల్లాలోని ఉపాధ్యాయులతో పాటు నంద్యాల జిల్లాకు చెందిన వారికి రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభమైంది. తొలి విడతలో భాగంగా ఈ నెల 26వ తేదీ వరకు జిల్లాలో 600 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు శిక్షణ ఉంటుంది. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులకు ఈ శిక్షణ నిబంధనలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఆరు రోజుల పాటు వారు సెంటర్ వదిలి బయటకు వెళ్లరాదంటూ అధికారులు స్పష్టం చేశారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు అయ్యబాబోయ్... ఇదేమి శిక్ష మాకు అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బడులు మూత వేసే కుట్ర..

ప్రాథమిక పాఠశాలలను మూత వేసే కుట్రలో భాగంగా వారాల కొద్దీ ఉపాధ్యాయులను శిక్షణ పేరుతో బడులకు కూటమి సర్కార్ దూరం చేస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. జిల్లాలో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్న పాఠశాలలు దాదాపు 60శాతం వరకు ఉన్నాయి. ఇద్దరు పనిచేసే స్కూల్ నుంచి ఒకరిని శిక్షణ పేరుతో నెలలో 15 రోజులు పాఠశాలకు దూరం చేస్తున్నారు. దీంతో మిగిలిన ఒక ఉపాధ్యాయుడిపై భారం పడుతోంది. విద్యా సంవత్సరానికి అతిముఖ్యమైన నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఇలాంటి కార్యాచరణ చేపట్టడం వెనుక పెద్ద కుట్రే దాగుందనే అనుమానాలను ఉపాధ్యాయులు సైతం వ్యక్తం చేస్తున్నారు.

విధి విధానాలు పాటిస్తున్నాం



ప్రాథమిక స్థాయిలో 3 నుంచి 9 సంవత్సరాల వయసున్న విద్యార్థుల్లో మనోవికాసం పెంపునకు దోహద పడేలా ఉపాధ్యాయులుకు వృత్యంతర శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశాం. కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఈపీ ప్యాట్రన్ ప్రకారం విద్యావిధానాలను పాటిస్తున్నాం. ఇందులో భాగంగా ప్రాథమిక విద్యపై ఎక్కువ దృష్టి సారించాం.

– డాక్టర్ దండేపాల్, రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణా తరగతుల రీజనల్ డైరెక్టర్

వృద్ధుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

- జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్



పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: వృద్ధుల పోషణ, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సూచించారు. వయో వృద్ధుల పోషణ, సంరక్షణకు సంబంధించి ముద్రించిన పోస్టర్లను బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రసూల్‌తో కలసి ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. వయో వృద్ధుల సహాయార్థం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ 14567పై ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ఈ నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తమ సమస్యలను తెలిపి వాటిని పరిష్కరించుకోవచ్చునన్నారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- పంట పొలాలకు పురుగు మందులు తేవడానికి వెళుతుండగా ప్రమాదం
- కూతలేరు బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఇసుక టిప్పరు
- అక్కడికక్కడే మృతి చెందిన ఇద్దరు స్నేహితులు
- సోదనపల్లిలో విషాదఛాయలు



మృతి చెందిన డ్రిప్పు అట్టి రమణ, పేట నాగేశ్వరరెడ్డి

శింగనమల: ఎక్కడికైనా ఇద్దరూ కలిసి వెళ్తుంటారు. కష్ట సుఖాల్లో సహకరించుకుంటారు. చివరకు మృత్యువులోనూ స్నేహబంధాన్ని మరువలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.

మూడు దశాబ్దాల స్నేహం..

శింగనమల మండలం సోదనపల్లి గ్రామానికి చెందిన అట్టి రమణ అలియాస్ డ్రిప్పు రమణ (50), పేట నాగేశ్వరరెడ్డి (53) మధ్య 30 ఏళ్ల క్రితం ఏర్పడిన స్నేహం అప్పటి నుంచి కొనసాగుతూ వచ్చింది. మంచి స్నేహితులుగా గ్రామంలో వీరికి పేరుంది. ఏ పనికైనా ఇద్దరూ కలిసి వెళ్లేవారు. ఇద్దరూ వ్యవసాయంతో జీవనం సాగిస్తూనే మరో వైపు జైన్ డ్రిప్పు కంపెనీలో పని పనిచేస్తున్నారు. ఎంతో అన్యోన్యంగా కలిసి తిరిగే వీరిని రామలక్ష్మణులుగా గ్రామస్తులు పిలిచేవారు.

కబళించిన ఇసుక టిప్పరు..

శింగనమల మండల పరిధిలో కొంత కాలంగా జాతీయ రహదారి–244డీ పనులు కొనసాగుతున్నాయి. పనులకు సంబంధించి అవసరమైన ఇసుక, కంకర తరలింపులకు రేయింబవళ్లూ టిప్పర్లను వినియోగిస్తున్నారు. టిప్పరు డ్రైవర్లు రోడ్డు నిబంధనలు విస్మరించి అతి వేగంగా వాహనాలను నడుపుతుండడంతో ఇప్పటికే పలు ప్రమాదాలు చోటు చేసుకుని పలువురు క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో తాము సాగు చేసిన పంట పొలాలకు పురుగు మందులు కొనుగోలు చేసేందుకు డ్రిప్పు రమణ, నాగేశ్వరరెడ్డి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. అనంతపురం–తాడిపత్రి మార్గంలో పోతురాజుకాల్వ వద్ద ఉన్న కూతలేరు బ్రిడ్జి వద్దకు చేరుకోగానే వెనుకనే వేగంగా దూసుకొచ్చిన ఇసుక టిప్పరు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ టిప్పరును ఆపకుండా ముందుకు దూసుకెళ్లడంతో దాదాపు ఫర్లాంగ్ దూరం వరకూ ద్విచక్ర వాహనంతో పాటు రమణ, నాగేశ్వరరెడ్డిని ఈడ్చుకెళ్లింది. డ్రిప్పు రమణ అక్కడిక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన పేట నాగేశ్వర్‌రెడ్డిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. డ్రిప్పు రమణకు 4 ఎకరాలు పొలం ఉంది. వేరుశనగ, చీనీ పంటలను సాగు చేశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పేట నాగేశ్వరరెడ్డికి 5 ఎకరాల పొలం ఉండగా, మునగ పంట సాగు చేశారు. ఆయనకూ భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

సోదనపల్లిలో విషాదఛాయలు..

ప్రమాదం జరిగిన ప్రాంతం సోదనపల్లికి 4 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో విషయం వెంటనే గ్రామస్తులకు తెలిసిపోయింది. దీంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఎంతో స్నేహంగా ఉన్న ఇద్దరినీ కబళించి ఎంత పనిచేశావయ్యా దేవుడా? అంటూ రోదించారు. విషయం తెలుసుకున్న శింగనమల ఎస్‌ఐ శరత్‌చంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన టిప్పరును వదిలేసి డ్రైవర్ పరారైనట్లుగా గుర్తించి, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

- అధికారులకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: రీసర్వే వల్ల ప్రజలకు కలిగిన సమస్యలు గ్రామ సభల్లో వెలుగు చూస్తున్నాయని, వీటిపై ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రీసర్వేపై ప్రజల అనుమానాల నివృత్తికి జిల్లాలోని 161 గ్రామాల్లో సభలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే 70 గ్రామాల్లో సభలు నిర్వహించామన్నారు. గతవారం జరిగిన గ్రామ సభల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 201, సర్వే శాఖకు సంబంధించి 1,043 ఫిర్యాదులు అందాయన్నారు. వాటన్నింటినీ త్వరగా పరిష్కరించాలన్నారు. గ్రామ సభల్లో రైతుకున్న భూ విస్తీర్ణం, సర్వే తర్వాత నమోదు చేసిన విస్తీర్ణం సరి చూసుకునే విధంగా చూడాలన్నారు. కనగానపల్లి, సీకే పల్లి, ముదిగుబ్బ మండలాల సర్వేయర్లు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఎక్కువగా భూములకు సంబంధించిన వాటిపైనే అర్జీలు అందుతున్నాయని, అందువల్ల వీలైనంత త్వరగా రీసర్వే చేసి భూ సమస్యలన్నీ పరిష్కరించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్, జిల్లా సర్వే శాఖ అధికారుల పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాలలో చేపట్టిన భూసేకరణ పనులు వేగవంతం కావాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎన్‌హెచ్–342, ఎన్‌హెచ్– 761జీ, వివిధ జాతీయ రహదారులు, గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ, పనుల పురోగతి, పెండింగ్ పనులపై ఆయా శాఖల అధికారులతో సమీక్షించారు. అవార్డు పాస్ చేసిన భూములకు ఎన్‌హెచ్ యాక్ట్ ప్రకారం భూసేకరణ జరగాలని, పనుల్లో జాప్యం జరగకూడదన్నారు. పుట్టపర్తి, కప్పలబండ, పెడబల్లి, గోరంట్ల, గొనివారిపల్లి, ముత్యాల చెరువు, కదిరి గ్రామాల్లో సమస్య ఉన్నందున సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకుని భూ యజమానులతో మాట్లాడాలన్నారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. సమావేశంలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, కదిరి ఆర్డీఓ శర్మ, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్, ధర్మవరం ఆర్డీఓ మహేష్, నేషనల్ హైవే భూసేకరణ విభాగం అధికారి ఎస్‌ఈ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ అమరుల కుటుంబాలను పరామర్శించిన ఎస్పీ



కానిస్టేబుల్ చంద్రశేఖర్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: విధుల నిర్వహణలో అమరులైన పోలీసుల సేవలను గుర్తు చేసుకుంటూ వారి కుటుంబసభ్యులను ఎస్పీరత్న పరామర్శించారు. నక్సలైట్ కాల్పుల్లో మృతి చెందిన బీడుపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ చంద్రశేఖర్ కుటుంబసభ్యులను బుధవారం ఎస్పీ కలిసారు. తల్లి నారాయణమ్మ, కుటుంబసభ్యులను పరామర్శించి, వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... 1993లో చంద్రశేఖర్ ఉద్యోగంలో చేరారని, విధి నిర్వహణలో నిజాయితీ గల ఉద్యోగిగా పలువురు మన్ననలు పొందారని గుర్తు చేశారు. 2003లో రామగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో నక్సలైట్ల కాల్పుల్లో చంద్రశేఖర్ మృతి చెందారన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసుల త్యాగాలు మరువలేమన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంట డీఎస్పీ విజయ్‌కుమార్, సీఐ సునీత ఉన్నారు.

యానిమేటర్లను విధుల్లోకి తీసుకోవాలి



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న యానిమేటర్లు

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అక్రమంగా తొలగించిన వైకేపీ యానిమేటర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో యానిమేటర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చంద్రబాబు నాలుగు నెలల పాలనలో కేవలం రాజకీయ కక్ష సాధింపులతో 400 మందికి పైగా యానిమేటర్లను అన్యాయంగా తొలగించారన్నారు. గౌరవ వేతనంపై ఆధారపడి జీవిస్తున్న వారికి ప్రస్తుతం పిల్లలను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఇందులో కొంత మంది హైకోర్టును ఆశ్రయించడంతో అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా న్యాయస్థానం స్టే ఆర్డర్ ఇచ్చిందన్నారు. ఈ ఆర్డర్ మేరకు వెంటనే విధుల్లోకి తీసుకుని వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ నరసయ్యను కలసి కోర్టు స్టే ఆర్డర్‌తో పాటు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వెంకటేష్, యానిమేటర్లు, ఆర్పీలు శకుంతలమ్మ, రామాంజనేయులు, చంద్రమోహన్, షబానా, అశ్వని, రామాంజనమ్మ, సుజాత, ఎంఎస్ స్వామి, నాగేనాయక్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేతగా చిత్తూరు, గుంటూరు



గుంటూరు బాలికల జట్టుకు విజేత ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక ముదిరెడ్డిపల్లిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అండర్–17 బాల, బాలికల వాలీబాల్ టోర్నీ విజేతగా చిత్తూరు, గుంటూరు జట్లు నిలిచాయి. మూడు రోజులపాటు సాగిన ఈ పోటీలు బుధవారం ముగిశాయి. చివరి రోజు బుధవారం బాలుర విభాగం సెమీఫైనల్స్ జరిగాయి. ఇందులో విశాఖపై గుంటూరు, శ్రీకాకుళంపై చిత్తూరు జట్లు గెలుపొంది ఫైనల్‌కు చేరుకున్నాయి. అనంతరం హోరీహోరీగా సాగిన ఫైనల్ పోటీలో గుంటూరుపై చిత్తూరు జట్టు గెలిచి మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రెండో స్థానంలో గుంటూరు, మూడో స్థానంలో విశాఖ, నాల్గో స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచాయి.

బాలికల విజేత గుంటూరు..

బాలికల విభాగంలో అనంతపురం, ప్రకాశం, చిత్తూరు, గుంటూరు జట్లు సెమీఫైనల్‌కు చేరుకోగా, తొలి సెమీఫైనల్‌లో ప్రకాశంపై చిత్తూరు జట్టు, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురంపై గుంటూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరుకున్నాయి. ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో చిత్తూరుపై గుంటూరు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో చిత్తూరు, మూడో స్థానంలో అనంతపురం, నాల్గో స్థానంలో ప్రకాశం జట్లు నిలిచాయి. విజేతలను అభినందిస్తూ ట్రోఫీలను నిర్వాహకులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, హెచ్‌ఎం సుధామణి, టోర్నీ అబ్జర్వర్ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ సురేష్ కుమార్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ మొరార్జీ యాదవ్, ముదిరెడ్డిపల్లి వాసులు మంజునాథ్, బండారు బాలాజీ, మంచాల మారుతి, పల్లా లక్ష్మీ కుమార్, ఏసీ నాగరాజు, ఓబులేసు, పామిశెట్టి శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు శివకుమార్, కోశాధికారి రామకృష్ణ, పీఈటీలు రామాంజనేయులు, ప్రకాష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

కదిరి అర్బన్: మండలంలోని కేఎస్‌పాలెం గ్రామానికి చెందిన వివాహిత రోష్ని (22) ఆత్మహత్య చేసుకుంది. బుధవారం రాత్రి విషపూరిత ద్రావకం తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, మృతురాలి కుటుంబసభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని సీఐ మోహన్ పేర్కొన్నారు.